అస్థిత్వం

జి.వి.

శ్రీనివాస్,

8-

18/1-1/3, శివాజి కాలని,

ప్రదీప్

నగర్ ,

విజయనగరం - 535 004.

77024 55559

ఆ గది లో వాతావరణం చాలా గంభీరం గా ఉంది. సీలింగ్ ఫ్యాన్ తిరుగుతున్నా ఆ గదిలో ఉన్న నలుగురి నుదుట చెమట ధారాళం గా కారుతుంది. తెలియని ఆందోళన తికమక పెడ్తుంది. కాలం నడక మాని మూలన కుర్చొందేమొనన్న సందేహం కలిగింది ముసలాయని కి.

" చట్ ! వెధవ గోల వెధవ గోల . మరీ మడిసి కి ఇంత పంతం పనికి రాదు " ...మెల్లగ గొనుకున్న గదిలో అందరికి స్పష్టం   గానే వినిపించింది. బహుశా వినబడాలనే అన్నాడేమో . కొడుకు గొనుకిది కి మెల్లగ తల తిప్పి చూసాడు ముసలాయన.

“బాప్పా, బాప్పా ! కాసింట టీ తాగుతావా ?" మంచం పై పడుకున్న అత్తను కదుపుతూ అడిగింది కోడలు .

ముసలాయన మంచం మీద పడుకున్న తన భార్య వైపు చూసాడు.

నిజం గా పడుకుందో , లేకా కళ్ళు మూసుకొని ఉందో తెలియదు గాని కదలకుండ పడుకొని ఉంది.

కొడుకు ముఖం చూసాడు.....ముళ్ళ మీద నిల్చునట్లు చాలా అసహనం గా ఉన్నాడు. కోడలు ని చూసాడు ఈ యవ్వరమేదో బేగి తేలి పోతో బాగున్ను అన్నట్లు కూకుంది.

" యెసెస్ ,,,,ఇంత సేపు ఇలా కూకొంటాము . అవతల వేనోడు వ చ్చేసుంటాడు. టైమయిపోతున్నది కదా " నిశ్శబ్దాన్ని ముక్కలు చేస్తూ వచ్చిన కొడుకు మాటల కు తలూపాడు ముసలాయన.

" నిజమేరా ,,,మరి ఇది ఇలా మొండి కేసి కూకుండి కదా, నానేటి సేసెది సెప్పు"..నిస్సహాయం గా అన్నాడు ముసలాయన .

తన్నుకు వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ " అమ్మా ! లేగు లేగు ,,,వేనోదు వచ్చేసాడు .మనూరెల్లి పోదాం " తల్లి ని పిలుస్తూ లేపబోయాడు కొడుకు. కాని తను ఆశించిన స్పందన తల్లి నుంచి రాకపోయేసరికి " ఛీ ,నీయమ్మ జీవితం " అని తిట్టుకుంటూ గదిలోంచి బయటకు పోయాడు.

- *   *
*   *   *

హాల్లో ని సోఫా లో కూర్చోని చుట్టూ చూసాడు . ఇల్లంతా నీటు గా ఉంది. పెద్ద టి.వి., ఓ మూలన ఫ్రిడ్జ్ , రెండు గదులు, ఓ వంటిల్లు ,,,బాల్కని ...థర్డ్ ఫ్లోర్ అవడం   వలన కిటికి లోంచి , బాల్కని లోంచి గాలి బాగా వస్తోంది. గోడలకి పుట్టీ పెట్టి ,పెయింట్ వెయ్యడం వలన ధగ ధగా మెరిసిపోతున్నాయి.   ఇల్లంతా సీలింగ్ ఊండటం వలన చల్లగా ఉంది.

మనసు పడి కొనుకున్న ప్లాట్ ఇది. టౌన్ లో మంచి ఏరియా లో చక్కగా కట్టిన అపార్ట్ మెంట్ లో థర్డ్ ఫ్లోర్ లో డబుల్ బెడ్ రూం ప్లాట్ ముప్పై ఐదు లక్షలు పోసి కొని, లోపల కప్ బోర్డులు అన్ని కలిసి నలభై లక్షలు అయ్యాయి.

తమది టౌన్ కి అరవై కిలో మీటర్ల లొని చిన్న పల్లెటూరు. పదెకరాలు వ్యవసాయ భూమి ఉంది. అమ్మా,నాన్నకు తనొక్కడే కావడం వలన చాలా గారాబంగా పెంచారు. చిన్నప్పటి నుంచి తన ఈడు పిల్లల తో గోళికాయలు, కబడ్డి ఆడుకొంటూ బడి కి సరిగ్గా వెళ్ళక చదువు ను నిర్లక్ష్యం చేసాడు . బడి అంటే

చెప్పుకోదగ్గ   దేమి కాదు. ఏదో ఒకటొ తరగతి నుండి ఐదో తరగతి వరకు బడి. అది కూడా సగం చెట్ల కిందే చదువులు.

సరిగ చదవకపోవడం ఏం కోల్పోయాడో తెలుసుకునే సరికి పెళ్ళీడు కొచ్చేసాడు. చూడటానికి ఎర్రగా బుర్రగా ఉండటం వలన , పదెకరాల లో బంగారం పండుతుండటం వల్ల మంచి సంబంధమే దొరికి పెళ్ళవడం , పిల్లలు పుట్టడం అంతా వెంట వెంటనే జరిగిపోయాయి.

అత్తరోది కూడా దగ్గర లోని పల్లెటూరే . తన భార్య టెంత్ చదివింది. తనకన్న ఎక్కువ చదువుకున్న పోనిలే   పిల్లలకు నాలుగు అక్షర ముక్కలు నేర్పిస్తుందని సరదా పడ్డాడు. అది కూడా కూడా పిల్లల కి   బడి లో జాయిన్ చేయ్యడానికి ముందే చక్కగా ఎ,బి,సి,డి లు నేర్పించింది . పిల్లలిద్దరు కూడా బాగా తెలివైన వాళ్ళూ, బుద్ది గా చదువుకుంటున్నారు.

అక్కడే మా చిక్కొచ్చి పడినాది . ఉళ్ళో ఐదో తరగతి అయిపోయకా పొరుగూర్లో ఉన్న హైస్కూల్ వెళ్ళి ఆరో తరగతి లో జాయిన్ చేయించాలి . అయితే వూర్లో చాలా మంది తమ   పిల్లలను ఆరో తరగతి నుంచి టౌన్ లో మంచి స్కూల్లో జాయిన్ చేయిస్తున్నారు.   కొంతమంది కుటుంబాల తో టౌన్ కెల్లిపోయి అక్కడే చిన్న చితకో ఉద్యోగమో, పనో ఎతుక్కొని పిల్లలను దగ్గరుంది చదివించుకుంటున్నారు.

" ఏవయ్యా! మన పిల్లలను కూడా మన లాగా ఈ పేడ, పెంట ఎత్తుతు , పొద్దల్లా ఆ పొలం లో చావమంటావా? మనఖర్మ ఇలా తగలడింది. మన పిల్లలకు ఈ బతుకొద్దు. పట్నంలో మంచి స్కూల్లో జాయిన్ చేద్దాం. పిల్లని డాక్టర్ , పిల్లోడి ని చక్కగ ఇంజీనీరు చేద్దమయ్యా. ఆళ్ళు సుకం గ ఉంటే చాలు కదయ్య. మనకెలాగు ఈ పనులు తప్పవు. నా మాట ఇను, మనకేలాగు ఈ బాధలు తప్పవు కనీసం ఆళ్లనన్న సుకపడని" పెళ్ళం మాటలు ఆలోచనలో పడేసాయి. పక్కూళ్ళో చదువుకొని సాదా సీదా బతుకు జీవితం బతుకుతున్న తనతోటి వారి ని చూసాకా పెళ్లాం చెప్పినదాంట్లో తప్పేమీ లేదని అనుకున్నాడు.

అదేమాట అమ్మా నాన్న లతో కూడా మాట్లాడితే వారు సరేనన్నారు.

" నిజమేరా ! సదువునేకపోతే పైసాకి కూడా పనికి రాముర. పిల్లలను టౌన్ లో మంచి బడి లో యేసి, సదివిద్దాం." అన్న తండ్రి మాటకు తల్లి కూడా " అవునురా నాయనా ! గుంటలిద్దరు బాగా సదువుకొని పెద్ద పెద్ద ఉద్యోగాలు సెత్తే సూడాలని ఉందిరా " .

" అలాగే సెద్దాం బాప్పా ! నేను ,పెనిమిటి టౌన్ లో స్కూల్ దగ్గర్లో ఒక సిన్నిల్లు తీసుకొని పిల్లలను సదివిస్తాం బాప్పా . నేను ఆ స్కూల్ లో ఏదైన సిన్న ఉద్యోగం లో జాయినవుతాను. పిల్లలకి తోడుగ ఊందొచ్చు కద. ఆయన యెక్కడైన పని లో చేరితే ఏ ఇబ్బంది వుండదు. "

అన్న కోడలు మాటలు కు " ఏటీ ,ఏటేటీ ,,,,నువ్వు పని లోని కి వెళ్తావా ?" నాకిష్టం నేదు " అని కొడుకు ని చూస్తూ తండ్రి ఇలా అన్నాడు.

" వురెయ్ బావూ, మీరిద్దరు పట్నం కెళ్ళిపోతే ఇక్కడ ఎగసాయం ఎలా సెత్తమురా ?" నాను సూత్తే ముసిలిలొడిని అయిపోయాను. నానొక్కిడి ని సేయ్యలేనురా ".

"మరేటి సెద్దాం సెప్పు..గుంట లిద్దరిని పక్కూరి బడిలో యేసి ఆళ్ళ బతుకు పాడు సేసియ్యాలా ?" బాధా, ఆవేశం కలిసి గొంతు లో ప్రతిధ్వనించాయి .

భర్త మాటలకు పిల్లలిద్దరి ని ఇక టౌన్ లో మంచి స్కూల్ వేయ్యడం అవడమోనన్న భయం తో చిగురాకులా వణికింది . " ఓరేయ్ బావు ,ఒక పని సెద్దం రా,పొలం కవులికిస్సెసి తల్లి నలుగురం పట్నం పోదాం రా".

" అలాసేసామంటే ఒక్క గింజ కూడా తినలేమే పిచ్చి మొద్దు. మన ఎగసాయం మనం సేత్తేనే కదా మనకి మంచిది. కవులికిస్సినోళ్ళ బాధలు నీకు తెల్దేటీ ?"

తల్లి , తండ్రి మాటలు విన్న తరువాత తను తీసుకొన్న నిర్ణయమే కదా ఇక్కడ దాకా తీసుకొచ్చింది. అందుకే అప్పటికప్పుడే బుర్ర లోకి ఆలోచన ని నిర్ణయం గా చెప్పాడు.

" అమ్మో, నాన్న, నువ్వు సూత్తే ఎగసాయం ఒంటరి గా చేసే పరిసిత్తి లో నేవు . ఒక పని సెద్దాం.."..అంటూ ముగ్గురి ముకాల వంక సూసాడు. ఏటి ఇనాలో అన్న ఆత్రం కనబడుతుంది ఆళ్ళ ముకా ల్లో.

" నేను, మీ కోడలు ఇక్కడే ఉండి ఎగసాయం సేసుకుంటాం. మీరిద్దరు టౌన్ లో ఇల్లు తీస్కొని పిల్లలని బాగ సదివించండి. ఓరానికొపాలి నేనో, మీ కోడలో ఒచ్చి కనబడ్తుతుంటాం ".

"మాకేటి యెరికరా ,ఆ పట్నం లో మేముండలేము " అన్న తల్లి మాటలకి నవ్వి ," అది కాదమ్మ , మేమొచ్చి ఓ నాలుగు రోజులుండి , పిల్లలన్ స్కూల్లో జాయిన్ చేసి వస్తాం ,,నువ్వేమి బెంగ పడకు. ఓ నాలుగు రోజులు ఉంటే అదే అలవాటయిపోయి మనూరు రమ్మన్న రావు సూడు" .

కొదుకు మాటలు తండ్రి కూడా "అవునేరా అదే మంచింది.కాని ఈ వయస్సు లో అందరం కలిపుండకుండా అలా దూరం గా ఊండటమే మనస్సు సివుక్కుమనేల ఊందిరా "

పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని తన భార్య ఎంటనే " అసి మనమేమైనా గొడవలాడుకొని ఇడిపోతున్నమా ఏటి ?. మీ మనవల సదువులకే కద టౌన్ ఎళ్ళేది . బసెక్కితే ఓ గంట , గంటాన్నర లో దిగిపోమా ? ఇంత కాలం కష్టపడ్డారు . ఇగనైన సుకం గా ఉండండి. " .

కోడలు మాటలు కు పెద్దోళ్ళిద్దరికి మనసులు తేలికపడ్డయి.

సరిగా అపుడే తన మావోచ్చాడు. ఆళ్ళ నాన్న కి రమ్మని కబురంపిందో లేదో గాని సరిగ్గ టయాని కి ఒచ్చాడు.

ఇసియమంతా ఇని " బావా , నీ కొడుకు సెప్పినట్లే టౌన్ ఇల్లు తీద్దాం. టౌన్ లో అద్దె కోంపల్లో మీరుందనేరు . ఆళ్ళ కి కోపం వొస్సిన మనమే ఎల్లిపోవాలా , మనకి కోపం వొస్సిన మనమే వొచ్చియాలా .నా మాట ఏతంటే టౌన్ లో ఒక సక్కని ఇల్లు కొందాం. ఈ పూర్వో ఇగో మీ ఇల్లు యెప్పుడో మీ తాత కట్టించింది. మనవలు పెద్దోళ్ళయితే ఆళ్ళకి నచ్చాలి కదా. పెద్ద పెద్ద సదువులు కెల్తారు. టౌన్ లో ఇల్లయితే మా బాగుంటడి. "

ఇరకాడు మాటలకి " టౌన్ లో ఇల్లు కొనలంటే మాటలా ? సానా సొమ్మయిపొద్ది కదా ".

'అయితే అవుద్దిలే ..మనకోసమే కదా "అన్న తల్లి మాటలకు అందరూ అంగీకారించారు.

" మరి సొమ్మో ??"

తండ్రి మాటకి " మరేం పర్లేదు బావా ..ఒకటి కావలంటే ఒకటి ఒదులుకోవాలి. రెండెకారాలు తీసెద్దం బావా,,,నువ్వా , నేనా అనేటి ఇల్లొస్తది. "

మావ మాటలకి అమ్మ నాన్నల ముకాల్లో బాధ బయటికి కనిపించింది .

అంతలోనే తన తండ్రి తేరుకొని " సర్లె, అలాగే సెద్దాం . గుంటలిద్దరి సదువుల కంటే మనకేది ముఖ్యం కాదుగా ".అని భరోసా ఇచ్చాడు.

"సెబాస్ ,,బావా ,యెంతైన మీ ఒంశం ఒంశమె బావా ".

ఇక జరగాల్సిన పనులన్ని మావే దగ్గరుండి సూసుకున్నాడు. పొలం బేరం పెట్టడం ,రెండకరాలు నలభై లక్షలు కి అమ్మించి స్కూల్ కి దగ్గర్లో ఈ అపార్ట్మెంట్ లో డబుల్ బెడ్ రూం కొన్నాడు.

ఏ మాటాకామాటే సెప్పుకొవలి ...మావన్నట్లు నువ్వ? నేనా అన్నట్టు బెమ్మండాం గా ఉంది ఇల్లు.

" పిల్లలిద్దరు సక్కగా చదువుకుంటాన్నారు . పెద్దోలిద్దరు కూడా నెమ్మదిగా ఈ వాతవరణానికి అలవాటు పడిపోయారు. అమ్మయ్య అనుకునే లోపు ఈ చిక్కొచ్చి పడింది".

" నాన్నా ! నాన్నా! అంటూ పిల్లల స్కూలు నుంచి ఇంటికి వస్తూనే గుమ్మం లోంచే తండ్రిని చూసి ఆనం దం తో వచ్చి ,ఒడిలో కూర్చున్నారు. పిల్లల రాక తో గత ఆలోచనలోంచి బయటకు వచ్చాడు.

- *

* * *

పిల్లల సందడి కి ముసలాయన కూడా లోపల గది లోంచి బయటకి వచ్చి,,పిల్లలను పలకరించి బాల్కని లోని కి వెళ్ళి నిలుచున్నాడు. సాయంత్రపు గాలి చల్లగా పలకరించే సరికి తమ వూర్లో పైర గాలి గుర్తుకొచ్చి , పాత వాసనలు మోసుకొచ్చాయి .

పట్నం లో ఇల్లు తీసుకొని భార్యా,మనవళ్ళ తో ఉండాలని అనుకొన్న తర్వాతా మనసంతా అదోలా అయిపోయింది. పుట్టిన వూరు ఇడిచి పెట్టి, బందుగులను ఒదిలేసి ఆ పట్నవాసం అంటే ఏదోలా ఉంది. కాని తప్పదు కదా. వారసులు జీవితం లో బాగా పైకి రావాలా ? తాతా గా నా పేరు అందరు సెప్పుకొవాలా.

ఇక్కడ ఒచ్చి రెండేళ్ళు ఇట్టే గడిచిపోయాయి . అయితే ఇంటావిడి కి ఒక సమచ్చరం కితం పెద్ద జబ్బు చేసింది. ఇసాకపట్నం తీస్కెల్లి పెద్ద పెద్ద డాట్టర్ల లందరి కి సూపిస్తే , కేన్సర్ అని చెప్పారు. ఒక్క సారిగా గుండె గుబ్బిల్లుమంది. ఇదిగో ఈ ఆర్నెల్ల నుండి జబ్బు బాగ ముదిరి పోయింది. రెండు లచ్చల దాకా కరుసయిపాయాయి. నిన్న ఆసుపత్తిరి కెల్తే డాట్టర్లు సెప్పెసారు ఇక రెండు, మూడు రోజలేనని. మరి బతికే అవకాసం లేదని.

ఉళ్ళో అందరు కూడా "పట్నం లో ఐతే ఏదైనా జరగరానిది జరిగితే సానా కవుకులు పడిపోతావు. నీ పెళ్ళాన్ని మనూరు తీసుకొచ్చాయ్ రా. ఇడాయితే అందరం ఉంటాం. తలొక చెయ్యేస్తాం కదా. ".

" వురెయ్యా, ఇంటిలొ సనిపోతే ఇల్లు ఓ ఆర్నెల్లో, సమచ్చారమో పాడుపేట్టియాలా . అసలే కొత్తిల్లు . అందుకే మా మాట ఇని, నీ పెళ్ళాన్ని

మానూరి కి తీసుకో చ్చేయ్" అని నిన్న సూపు కు ఒచ్చిన పెసిడెంట్ కూడా అదే మాట సెప్పాడు.

ఇది సూత్తే "నాను మనూరు రాను, ఇక్కడే ఊంటా . ఆ సావేదో ఇక్కడే సత్తాను." అని మొండి కేసి కూకుండి.

ఎందుకే అంటే ఒక వులుకుండదు, పలుకుండదు. పల్లక పడుకొని కళ్ళు మూసుకుంటది. ఆ జబ్బు నొప్పి తో పేనం విల విల లాడిపోతుంటే నొప్పి కి సానా బాద పడిపోతుంది.

పోని , ఇక్కడే ఉండిపోదామనుకుంటె సూస్తున్నను కదా. ఈ రెండు సమచ్చరాల నుంచి ఒక ఇరుగు నేదు, పొరుగు నేదు . పోని మాట కలుపుదమంటె వోరి గుమ్మం తీసి ఉండదు. అదేంటో పొద్దస్తమానం తలుపులు బిగించే ఉంచుతారు. ఇక్కడ ఏదైన జరిగితే వొక్కరు రారు. పక్కింట్లో ఏం జరిగిన పట్టించుకోరు . ఏం మడుసులో? ఏం బతుకులో ?

ఒచ్చి ఇన్నాళ్ళయిన ఓచ్చిమెన్ తప్ప మరేవరు పెద్దగ తెలియదు. ఓచ్చిమెన్ కూడా యేదో పల్లెటూరు నుండి వలసొచ్చడంట. అందుకే గాబోలు మనిసి కనబడితే మనసారా పలకరిస్తాడు.

వుప్పుడేటి చేయ్యడం ? ఇది సూతే మొండికేసి కూకింది.ఏటి మార్గం ?'

* * *
* *

అలా కళ్ళు మూసుకొని కదలక , మెదలక పడుకొన్న అత్తను చూస్తుంటే ఏటి సెయ్యాలో తెలియక కాలు చెయ్యి ఆడడం లేదు . అసలు బాప్పెందుకు ఊరి కి రానంటుంది ? ఎవరైనా ఆఖరి రోజులలో సొంత వూర్లో ఉండాలనుకుంటారు . మరేటిది నాను రాను గాక, రానని తెగేసి సెప్పేసింది.

ఒకవేళ డాక్టర్ చెప్పినట్లు బాప్ప కి జరగరనిదే జరిగితే ఈ ఇల్లు పాడు పేట్టియ్యలా . పిల్లల కి చూస్తే ఓ రెన్నెళ్ళో పెద్ద పరీక్షలు ఉన్నాయి .ఇల్లు పాడుపెడితే పిల్లలు చదువులు ఏటవ్వాలా ? పరీక్షలు ముందు స్పెషల్ క్లాసులు చెప్పుతున్నారు . బాప్ప పరిస్థితి చూస్తే ఇలా ఉంది.

అదే వూళ్ళోకి వెల్లిపోతే ఏదైనా చెడు జరిగితే ,కార్యక్రమాలు అయిన తర్వాత పిల్లలను తీసుకొని టౌన్ లోని ఇంటి కి వచ్చి పరీక్షలు అయ్యేంతవరకు ఇక్కడే ఉండాలన్నది తన ఆలోచన. తన భర్త కూడా తన ఆలోచనే కరెక్టు అన్నాడు. కాని బాప్ప చూస్తే ఇలా.....

బాప్ప ని మెల్లగా చేత్తో తడుతు బాప్పా....బాప్పా ...అని మెల్లగా పిలవ సాగింది . నిన్నటి నుండి అన్ని మంచం మీదే జరుగుతుండటం వలన అదో రకమైన వాసన వస్తుంది మంచం.

పిలవగా పిలవగా మెల్లగా కళ్ళు తెరిచి చూసింది .

ఎంటి ? అన్నట్లుగా చూసిన చూపు కి " అదికాదు బాప్పా ! తెల్వక అడుగుతాను. ఎవరైన సొంతూరు కి వెల్లిపోతామంతే సరే అంటారు కదా. మరి నువ్వేటి నాను రాను అని తేగేసి సెప్పేశావు. ఏటైనాదో నాకు సెప్పవా ? "

ఒంట్లో బాగు లేకపోయిన నుంచి కోడలే తనను చిన్న బిడ్డ లా చూసుకోవడం వలన కోడలు పట్ల ఉన్న ప్రేమాభిమానాలు మరింత పెరిగడం వలన లేని ఓపిక తెచ్చుకొని , మెల్లగా మాట్లాడటం ప్రారంభించింది .

“నీకు తెలుసు కదా. మీ మావ నాకు మేనమామ కొడుకని. చిన్నప్పటి నుంచి కలిసి ,మెలిసి పెరిగాం. పొద్దస్తామానం చాకిరి, చాకిరి.తెల్లారే సరికి లేచి పసువులకు జావ కాచి, కుడితి పెట్టి, పొలంకెల్లి మోటారు రాకపోతే నుయ్యి నీళ్ళు తోడి, ఎనిమిదయ్యే సరికి ఇంటికొచ్చి, తానం చేసి అందరి కి అన్నాలు వండి మళ్ళా మీ మావ కి, పెనిమిటి కి అన్నాలు లు మోసుకొని పొలం కి ఇచ్చి ఆళ్ల తో పాటే ఇంత కూడు తిని మరల ఇంటికి రాగానే తిరిగి చాకిరి. ఇలా నా బతకు గానుగెద్దు బతుకయ్యిపోయింది. నువ్వొచ్చెకే నాకు కూసింత తీరుబడి దొరికింది. చాకిరి చేసి చేసి పెద్ద గా వొయసు అవకపోయినా ముసల్దన్ని అయిపోనాను “

నేను మీ మావా ని చేసుకున్నప్పుడు పసుపు కుంకాల కింద ఐదెకరాలు తెచ్చాను.

కాని పేరు లేదు, పెంపు లేదు.   పనిదానికన్న అధ్వాన్నం గా బతికాను.   " పట్నం లో ఇల్లు కొంటామంటే ముందు అదోలా అనిపించిన , అమ్మయ్య పేనాని కి సుకం దొరుకుతుంది. మీ మావ కి కూడా కాసింత వీలు దొరుకుతుంది అనుకొని సాన సంబర పడ్డాను. "

" అందుకే నా పసుపు,కుంకాల పొలం అమ్మినా నాను బాద పడలేదు. ఈ ఇల్లు నా పేరు మీద కొంటున్నప్పుడు మాత్రం సానా సంబరపడిపోనాను. పుట్టిన ఇన్నాళ్టి కి నా పేరు మీద ఒక ఆస్తి పత్రం ఉందని ఆనందపడిపోయాను. పసుపు కుంకాల పొలం కూడా మా అయ్య పేరు మీదే ఉంది, మాటవరసకే నాది   . అమ్మినప్పుడు మా అయ్యొచ్చి యేలిముద్రేసినాడు అంతే.

పోనిలే ఇక్కడ పేనం సుకం గా ఉందిలే అనుకుంటె బగమంతుడు ఈ జబ్బు ఇచ్చాడు.   "

"ఊర్లో ఉన్నప్పుడు సానా కాలం ఆ కర్రల తో, కంపల తో వంట చేసి ఇదిగో ఈ మాయదారి జబ్బు తెచ్చుకున్నాను.   "

ఆయాసం తో మాట రాక,,ఓపిక లేక కాసేపు ఆగి , మాట్లాడటం ప్రారంభించింది.

“ వూర్కో కెల్తే గంటో, గడియో అన్నట్లున్న నన్ను అక్కడ ఇంటిలో పెట్టరు. గుమ్మం ముందు సాల దగ్గర నాలుగు కర్రలు పాతి, దుప్పట్ల తో పందిరేసి , కిందన నన్ను చాప మీద పడుకోబెట్టేస్తారు. ముందు పూట అంతా బాగనే ఉంటాది. రేత్రయ్యేసరికి తోడుగా వుండెటోల్ల మాటలు ఇక ఇనలేము. ఇక ఒక రోజు గడిచిపోయి సరికి ఇగ అసలినలేం . ..ఆ మాటలు."

“ పనులు మానుకు కూకున్నమని కొందరు, అరే కేంపెల్లాలి ,బయర్దెరిపొయాక ఏ కసురు ఇనాలో నని ఉండిపోయాను. ఇదేదో తేలిపోతో బాగున్ను అని ఇంకొందరు గుస గుస లాడుకొంటారు.

"ఆల్ల మాటలు ఇంటున్నప్పుడు నిజంగా నే ఆ చనంలో పేనం పోతే బాగున్ను అనిపిస్తుంది. పొరపాటున మరో రోజు గడిచిందా ? ఇక అంతే".

ఇల్లు పాడు పెట్టాల్సి వస్తుందని కొంతమంది జబ్బు చేసినోల్లని ఆకరి చనాల్లో ఆసుపత్తిరి లో వుంచేస్తున్నారు. ఆసుపత్తిరి పేనం పోతే , గుమ్మం నుంచే కాటికి తీసుకేల్లిపోవచ్చు , ఇల్లు పాడు పెట్టానక్కర్లేదు అని ఆలోచిస్తున్నారు . పోయే ముందు ఇంటాందిరి ని ఆకరి సూపులు సూసుకొని, ఇన్నాల్లు బతికిన ఇంట్లో పెసాంతం గా గాలి లో కలిసిపోవాలనుకోవడం తప్పా?"

ఆవేదన గా అత్త మాట్లాడుతుంటే గుండె కదిలిపోయింది కోడలి కి.

" ఐన నా సొంత ఇల్లు ఉండగా నా కలాంటి సావోద్దు. నా పేనాలు ఈ ఇంటిలోనే గాలిలో కలిసిపోవలా ? నేను చచ్చిన బతికినా నా ఇంటి లోనే ఉంటా. అంటె...నానేక్కడికి రాను"

మన స్సు లోని బాధ నంతా బయటకి చెప్పిన తర్వాత అలసట గా కళ్ళు మూసుకున్న బాప్ప ను చూస్తు ....జారి పోతున్న కన్నీళ్ళు ను తుడుచుకుంది కోడలు.

** ** ***
****

గుమ్మం దగ్గర కి వచ్చిన అంబులెన్స్ డ్రైవరు ని చూసి , బాల్కనీ లో ఉన్న తండ్రి ని పిలిస్తూ ..." అయ్యా ! వెనోడు ఒచ్చాదు. బేగి రా "

" అమ్మను ఎత్తుకొని దింపాలా....టెచ్చరు కూడా పైకి తే. అలాగయితేనే ఈజీ గా దించగలం." అని డ్రైవర్ తో   అన్నాడు.

డ్రైవర్ కిందకి వెళ్ళీ, వాచ్ మేన్ ని కూడా సాయం కోసం తీసుకోచ్చాడు.

ఏం జరుగుతుందో తెలియక పిల్లలు బిక్కయిపోయి ఒక మూల నిల్చున్నారు.

అందరు కలిసి గదిలోనికి వెళ్లారు.

" అమ్మా,అమ్మా...లెగు లెగు ....మనూరు ఎల్లాలి " అంటూ తల్లి లేపసాగాడు.

" నాను రానని సెప్పను కదా ర, నేనిక్కడే ఊంటా " అని నీరసం గా అయిన దృఢం గానే చెప్పింది .

" ఇలా కాదు గాని, డ్రైవరు తెచ్చర్ ఇలా పట్రా....అయ్యా,,అమ్మను మెల్లగా తెచ్చర్ మీద పడుకోబెట్టు"

" నువ్వు కూడా చెయ్యెయ్యవె " అని భార్య ని కూడా పురమాయించాడు.

ముసలాయన కళ్ళు నీళ్ళ తో భార్య తల దగ్గర పట్టుకొని ఎత్త సాగాడు. కొడుకు కాళ్ళు పట్టుకొని మెల్లగా ఆవిడను మంచం పై నుంచి లేపడానికి ప్రయత్నం చేస్తుంతే , డ్రైవర్ , వాచ్ మేన్ కలిసి స్త్రెచ్చర్ ని మంచం కు సమాంతరం గా పట్టుకొన్నారు చెరొక వైపు పట్టుకొని.

"ఆ...మెల్లగా ...మెల్లగా ...అలాగే పైకి లేపండి" ..ఇంతకు ముందు ఇలాంటి కేసులెన్నో చూసిన అనుభవం తో అంబులెన్సె డ్రైవర్ సలహా ఇస్తున్నాడు.

పిల్లలు గోడకి అతుక్కుపోయి భయం భయం గా చూస్తున్నారు.

కోడలు అత్త మనసులోని కోరిక తెలిసి కూడా ఏమీ చేయ్యలేక తన్నుకు వస్తున్న దు:ఖాన్ని దాచుకొంటూ అత్తను పైకి ఎత్తిపట్టడం లో సాయం చేస్తుంది.

రాత్రనక ,పగలన ఒక్క నిమిషం కూడ తీరిక లేకుండా , ఎన్ని పనులైన సరే విసిగిపోకుండా చే సే తల్లిని అలా ఎత్తి పట్టుకోవడం చూస్తూ బాధ తో కొడుకు క ళ్ళ నుంచి జారిన కన్నీరు తల్లి పాదాలపై పడి వెచ్చగా జలజలా రాలాయి.

కొడుకు కన్నీరు వెచ్చదనం తో మెల్లగా కళ్ళు తెరిచి, జరుగుతున్నది అర్థం అయి,అందరి ముఖాలు చూసింది. అందరి ముఖాల లోను విషాదం కనిపిస్తుంది. మనవడిని, మనవల్లని దగ్గరకు పిలిచింది .

దగ్గరకు వచ్చిన వారసులను చూస్తూ పెనిమిటిని, కొడుకు ని, కోడలను చూస్తూంటే ముసలావిడ కంటి నుండి,కన్నీరు నిశ్శబ్ధం గా జారసాగాయి.

" అలాగే , అలాగే పట్టుకొని ఎత్తండి " అన్న డ్రైవర్ మాటతో ఒక్కసారిగా ముసలావిడని పైకి ఎత్తారు.

అంతే....అందరిని తృప్తిగా చూస్తూ ముసలావిడ ప్రాణాలు వదిలేసింది తన గది లో, తన మంచం పైనే ప్రాణాలు వదిలేసింది.

గొల్లుమన్నారందరు.

**   ***   **